క్లుప్తంగా

ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవానిపాలెం : చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడారు. ఆలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు శీఘ్రముగా వివాహం జరగాలని ప్రత్యేకంగా హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పసుపు కొమ్ములతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బండ్లమ్మ వారిని మహాలక్ష్మిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ



పిట్టలవానిపాలెం : సార్వత్రిక ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు బలగాలు పనిచేస్తున్నట్లు బాపట్ల ట్రైనింగ్ డీఎస్పీ శ్రీవిద్య, చందోలు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. సంగుపాలెం, కోడూరు, మంతెనవారిపాలెం గ్రామాల్లో పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లోని అన్ని పార్టీల నాయకులు, ఓటర్లు పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటర్ల అవగాహన ర్యాలీ



భట్టిప్రోలు: భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ప్రతి పౌరుడు విధిగా పాటించాలని తహసీల్దారు ఐ.మునిలక్ష్మి పేర్కొన్నారు. భట్టిప్రోలులో శుక్రవారం భారత ఎన్నికల కమిషన్ సంబంధించిన ఎస్‌డబ్ల్యూఈఈపీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా నిబద్ధత గల నాయకులను ఎన్నుకోవడం ద్వారానే దేశ ప్రగతి, సమాజ వికాసం సాధ్యమవుతుందన్నారు. ప్రతి పౌరుడు ఓటింగ్‌లో పాల్గొని నూరు శాతం ఓటింగ్ జరిగేటట్లు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, సీసీలు కె.రజనీ కుమారి, కె.హనోక్, అకౌంటెంట్ బి.శిరీష, సర్వేయర్ బాబురావు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



యాజలి (కర్లపాలెం): ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దారు నిర్మలానంద బాబా తెలిపారు. శుక్రవారం యాజలి గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై జరిగిన అవగాహ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నికల్లో నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు. 18సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గ్రామ రెవెన్యూ అధికారి శివ నాగేశ్వరరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.సునీత, మహిళా పోలీస్ బేగం, బూత్ స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- భట్టిప్రోలు, పెదపులివర్రులలో భక్త జన కోలాహలం
- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శేషవాహనంపై శ్రీవారి ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో పొన్నమాను

భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన భ్రమరాంబ మల్లేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం బిందె తీర్థం, అభిషేకం, నిత్య హోమం, బలి హరణ కార్యక్రమాలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. రాత్రి పొన్నమాను ఉత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమాన్ని తిరువీధుల బాలాజీ, శ్రీధర్ పర్యవేక్షించారు. శనివారం రాత్రి స్వామి వారి ఆలయంలో జగజ్జ్యోతి, అనంతరం ఎదురుకోల మహోత్సవం వైభవంగా జరగనుంది. అద్దేపల్లి, భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘం స్వామివారి కల్యాణానికి తలంబ్రాల బియ్యం, మెట్టెలు, మంగళ సూత్రాలు సమర్పిస్తారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన దివ్య రథోత్సం ఆదివారం సాయంత్రం జరుగనున్నది. కార్యక్రమాలను కార్యనిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు, ఫౌండర్ ట్రస్టీలు, వంశపారంపర్య ధర్మకర్తలు, అద్దేపల్లి, భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘీయులు పర్యవేక్షిస్తున్నారు. రాత్రి గుండి పార్వతమ్మ మహిళా సమాజం ఆర్గనైజర్ మళగొండి సుమలత, పద్మావతి శ్రీనివాస భజన మండలి, దాస సాహిత్య ప్రాజెక్ట్, టీటీడీ ఆర్గనైజర్ తూనుగుంట్ల ఛాముండేశ్వరి, కోట సంధ్యారాణి బృందాల భజన కార్యక్రమాలు జరిగాయి.

పెదపులివర్రులో..

పెదపులివర్రులో కొలువైన భూనీళా సమేత వరద రాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం, రాత్రి నిత్యహోమం, బలిహరణ శాస్త్రయుక్తంగా నిర్వహించారు. రాత్రి స్వామి వారి ఎదుర్కోలోత్సవం, కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. గరుడ వాహనంపై స్వామి వార్లకు గ్రామోత్సవంగావించారు. గురువారం రాత్రి శ్రీ నటరాజ నృత్య కళానికేతన్ (తెనాలి) ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య శిష్య బృందం కూచిపూడి, జానపద, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈఓ మేకా సాంబశివరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు

రేపల్లె రూరల్: పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో రెండవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆలయంలో నవకుంభారోపణ, నిత్యహోమం, బలిహరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారిని ఉదయం హనుమద్వానంపై, రాత్రి శేష వాహన వాహనంపై పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారికి హారతులుపట్టారు. ఆలయ సింగిల్ ట్రస్టీ గడ్డం రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం కల్యాణ మహోత్సవాలు, ప్రత్యేక పూజలు, అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సువిధ యాప్‌లో ఎన్నికల ప్రచార అనుమతులు

జాయింట్ కలెక్టర్, బాపట్ల ఆర్వో చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జేసీ, ఆర్వో శ్రీధర్

బాపట్ల: ఎన్నికల ప్రక్రియను సజావుగా సాగేందుకు మీడియా మానిటరింగ్ కమిటీ సూచనలు, ఆదేశాలు కచ్చితంగా పాటించాలని బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి చామకూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం బాపట్ల తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు ప్రచారానికి సంబంధించి అనుమతులను సువిధ యాప్‌ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దానికి సంబంధించిన ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రచార వాహనాలు, అనుమతులు ఇంటింటి ప్రచారానికి సంబంధించి సువిధ యాప్ ద్వారా మాత్రమే అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. పత్రికలకు సంబంధించి పెయిడ్ ఆర్టికల్స్, మీడియా మానిటరింగ్ కమిటీ నిఘా ఉంటుందన్నారు. పెయిడ్ ఆర్టికల్స్ ప్రచురిస్తే దానికి సంబంధించిన ఖర్చులు ఆయా అభ్యర్థి ఖాతాకు చేరుతాయని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు, పార్లమెంటు అభ్యర్థి రూ.90 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చన్నారు. దీనిపై ఇప్పటికే రాజకీయ పార్టీలకు వివరించడం జరిగిందన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి అంశంపై ఎన్నికల విభాగం నిఘాతోపాటు మీడియా మానిటరింగ్ కమిటీ పరిశీలిస్తుందన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం మొదలు ఫలితాల లెక్కింపు, ఫలితం ప్రకటించే వరకు అవసరమైన అన్ని చర్యలకు తీసుకున్నామన్నారు. బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 202 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఈవీఎంలను బాపట్ల పబ్లిక్ స్కూల్లో భద్రపరిచామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు తహసిల్దారు కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధివిధానాలకు లోబడి మాత్రమే పోటీలో ఉన్న అభ్యర్థులు మీడియా ప్రతినిధులు నడుచుకోవాలన్నారు. సమావేశంలో బాపట్ల తహసీల్దారు ఎం. శ్రావణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పిట్టలవానిపాలెం తహసిల్దారు స్ఫూర్తి పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలను నమ్మొద్దు

వైఎస్సార్ సీపీ వేమూరు అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు



ఆత్మీయ సమావేశంలో స్థానికులతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

వెల్లటూరు(భట్టిప్రోలు): అధికారం కోసం ప్రతిపక్షాలు తమ పాలనపై లేని పోని ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలను చూస్తున్నాయని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు అన్నారు. వెల్లటూరులో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మోటూరి చౌదరి స్వగృహంలో అశోక్‌బాబు మాట్లాడారు. ఎన్నికల సమయం రాగానే ప్రతిక్షాలకు ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. ఏది నిజమో, ఏది అబద్ధమో గ్రహించి ప్రజలు తీర్పునివ్వాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పాలన చూసి వైఎస్సార్ సీపీకి ఓటెయ్యాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. తొలుత గ్రామ దేవత శ్రీకట్లమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించి, ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, మండల జేఏసీ కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, మాజీ సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు దారావత్ కుమారిభాయి, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బండారు శ్రీనివాసరావు, గురిందపల్లి సునీల్, చందోలు రవికుమార్, చౌటూరి రవీంద్ర, కుందేటి రమేష్, మల్లోలు నాగబాబు, మేరుగ చలంబాబు, కోటి, జంగం వాసు, మాతంగి రత్నకుమార్, కృష్ణ నాయక్, స్వామినాయక్, ముసలయ్య, కోటయ్య, సీతారామయ్య, మోపిదేవి కృష్ణారావు, శంకర్, కట్టా నాగరాజు, లాజర్, శివమణి, దావూరి నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీటికీ ముసుగేయండి



గాజుల్లంక సొసైటీ బ్యాంక్‌లో శిలాఫలకం

కొల్లూరు : ఎన్నికల నేపథ్యంలో కొల్లూరు కరకట్ట దిగువన ఉన్న గ్రామాలాల్లో మండలస్థాయి అధికారులు పర్యటించారు. 13 లంక గ్రామాలకు ప్రధాన మార్గంలో జనసేన పార్టీ ఎన్నికల గాజు గ్లాసు గుర్తు ప్రజలందరికీ గోచరిస్తున్నా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది. పెసర్లంకలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న జనసేన గుర్తు, ఆవులవారిపాలెంలోని గాజుల్లంక సొసైటీ బ్యాంక్‌లో ఉన్న టీడీపీ మాజీ ప్రజాప్రతినిధులు, సొసైటీ బ్యాంక్ సభ్యుల శిలా ఫలకాలు దర్శనమిస్తున్నాయి. అయితే వీటిని వెంటనే తొంగిస్తామని వేమూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ వసంతరాయుడు తెలిపారు. వెంటనే తహసీల్దారు పుల్లయ్య, ఎంపీడీఓ లక్ష్మీకుమారిలను సంబంధిత ప్రదేశానికి పంపించి, వాటిని తొలగించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు.

నీరు లేనిదే మానవ మనుగడ లేదు

డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు

బాపట్ల: నీరు లేనిదే మానవ మనుగడ లేదని.. నీటి కోసం యుద్ధాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. వి. శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయ కళాశాలలో అగ్రానమి, సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవ సభకు అధ్యక్షత వహించి, మాట్లాడారు. పెరుగుతున్న జనాభా అవసరాలను గుర్తించి, నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సేద్య విభాగాధిపతి డా. కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థిరత్వానికి, శ్రేయస్సుకు నీరు పోషించే కీలక పాత్రపై ఈ ఏడాది 'వాటర్ ఫర్ పీస్' అను సందేశం నిర్దేశించబడిందని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ రావూరి వీర రాఘవయ్య మాట్లాడారు. మారుతున్న విపరీత వాతావరణ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.హేమ, డాక్టర్ వి.సీతారాంబాబు, డాక్టర్ బి.అపర్ణ, టీచింగ్ స్టాఫ్, డాక్టర్ సిద్దార్థ నాయక్, డాక్టర్ బి.సురేష్ కుమార్, డాక్టర్ పి.గౌతమి, డాక్టర్ జి. శ్రావణలక్ష్మీ తదితర పాల్గొన్నారు.

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో రోటరీ క్లబ్ సహకారంతో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం డాక్టర్ డీడీ స్మిత్ అధ్యక్షత వహించారు. రోటరీ క్లబ్ సెక్రటరీ ఉపేంద్ర గుప్తా, లక్ష్మీ, డాక్టర్ జి.రవిబాబు, డాక్టర్ అశోక్ కుమార్, రత్నరాజు జల దినోత్సవం గురించి వివరించారు.

ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో..

జీవనాధారం జలం లేనిదే జీవం లేదని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్.ఏడుకొండలు తెలిపారు. నీటి ప్రాధాన్యం తెలియజేస్తూ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముందుగా నీటి ప్రాధాన్యం తెలియపరిచేందుకు కళాశాలలోని విద్యార్థులకు 'లీవరైజింగ్ వాటర్ ఫర్ పీస్' అనే థీమ్ గురించి పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు వీవీ సత్యనారాయణ, డాక్టరు గౌతమి పాల్గొన్నారు.

భట్టిప్రోలు వైఎస్సార్ సీపీ కార్యవర్గం నియామకం



మోర్ల శ్రీనివాసరావు

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ మండల కార్యవర్గాన్ని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. పార్టీ మండలాధ్యక్షుడిగా మోర్ల శ్రీనివాసరావు (నానీ), ఉపాధ్యక్షులుగా ఉడతా లక్ష్మీన్నారాయణ, బుస్సా రాజారత్నం, ప్రధాన కార్యదర్శులుగా పాలాటి హనుమంతరావు, వేల్పూరి బాల సుబ్రహ్మణ్యం(చిన్నారి), మద్దుల వెంకట శివ రామ కృష్ణమూర్తి, కార్యదర్శులుగా వాకా సీతారామయ్య, మోర్ల కోటేశ్వరరావు, గురిందపల్లి సునీల్‌కుమార్, మహ్మద్ జానీ, పంచుమర్తి వెంకట ప్రసాద్, నీలా రమేష్, మల్లిపెద్ది రామలింగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా పురమా శ్రీనివాసరావు, షేక్ మహ్మద్, పరుచూరి రజనీకాంత్, చేబ్రోలు నాగార్జున, పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు, కుక్కల యుగంధర్, పోలన పాండు రంగారావు, చిలకా జాషువా, దారావత్ కృష్ణానాయక్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి.

25న అష్టలక్ష్మి అమ్మవారి జయంతి

తెనాలి: శ్రీదండిస్వామి మఠానుబంధమైన తెనాలి కొత్తపేటలో గల శ్రీఅష్టలక్ష్మీ పీఠంలో ఈనెల 25న శ్రీ అష్టలక్ష్మి అమ్మవార్ల 26వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీ దండిస్వాముల దివ్యాశీస్సులతో ఆరోజు ఉదయం నాలుగు గంటలకు మహాభిషేకంతో వేడుకలను ఆరంభిస్తారు. అనంతరం ఆరగింపు సేవ, హారతి, సహస్ర నామార్చన, హారతి, తీర్థప్రసాదాల వినియోగం, మధ్యాహ్నం మూడు గంటలకు ఊరేగింపు ఉంటాయని నిర్వాహకులు తెలియజేశారు. సాయంత్రం ఆరు గంటలకు ఎన్జీవో కల్యాణ మండపంలో ఊంజల సేవ జరుపుతారు. అనంతరం నంబూరు శ్రీ కాళీ వనాశ్రమ పీఠాధిపతి చంద్రకాళీ ప్రసాద మాతాజీ, పెదపులిపాక శ్రీ విజయ రాజేశ్వరీ శ్రీ విద్యాపీఠాధిపతి వాసుదేవానందగిరిస్వామి, బళ్లారిలోని శ్రీగురుగీత మందిరాధిపతి నిత్యానంద భారతీ స్వామి ప్రవచనం ఉంటుందని వివరించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

మార్కుల కన్నా కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యం



విజయలక్ష్మిని సన్మానిస్తున్న శ్రీనివాసరావు,సుధ

తెనాలి అర్బన్: విద్యార్థులంతా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలని ఉన్నతి ఫౌండేషన్ చేంజ్ మేకర్ ఎస్.విజయలక్ష్మి సూచించారు. కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో 40రోజులుగా నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస, వృత్తి నైపుణ్యాల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలు ఉద్యోగాల ఎంపికలో మార్కులు కన్నా కమ్యూనికేషన్ స్కిల్స్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. మారుతున్న కాలనీకి అనుగుణంగా విద్యార్థులు తమ వ్యక్తిత్వ, వృత్తి నైపుణ్యాల్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా విద్యార్థులకు తగిన శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాల్ని ఉపయోగించుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విజయలక్ష్మిని సన్మానించారు. అధ్యాపకులు శ్రీ సుధ, నయాబ్ రసూల్, సూపరింటెండెంట్ జగన్మోహనరావు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: ఆర్థిక సమస్యలతో పురుగు మందు తాగి వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ నరేష్ కుమార్ వివరాల మేరకు..కాకుమాను మండలం పెద్దివారిపాలెం గ్రామానికి చెందిన వల్లూరి రవిబాబు(27) కూలీ పనులు చేసి జీవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై మనస్థాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి గుంటూరు వెళుతున్నానని చెప్పి ఏటుకూరు సమీపంలోని పొలాల్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య మౌనిక ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేశారు.

చెత్త సేకరణలో అలసత్వం వద్దు

తెనాలి అర్బన్: చెత్త సేకరణలో అలసత్వం ప్రదర్శించవద్దని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. పట్టణంలోని 33, 34 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలను కూడా ప్రతి రోజు శుభ్రం చేయాలని ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని చెప్పారు. టిఫెన్ విక్రయించే వ్యక్తి ప్లాస్టిక్ కవర్లు వినియోగించడాన్ని గమనించిన ఆయన రూ.1000 అపరాధ రుసుం విధించారు. రోడ్డుపై ప్లాస్టిక్‌కప్పులు వేసినందుకు మరో చిరు వ్యాపారికి రూ.200 అపరాధ రుసుం విధించారు. ఆయన వెంట పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

జేఎంజే ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు పుట్టినరోజు వేడుకలు



గుంటూరు రూరల్: అనాథలు అభాగ్యులకు తోడుగా మేమున్నామంటూ వారికి ఆదరణ చూపించి ఆదుకోవటం ఎంతో సంతోషకరమని రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం నల్లపాడు గ్రామంలోని జేఎంజే సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో మీతో మేము అనే కార్యక్రమంలో భాగంగా అనాథ పిల్లలకు పుట్టినరోజు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అనాథలు, తోటివారికి సహాయం చేయటం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. బాలబాలికలకు చేయూతనందిస్తూ వారి ఉన్నతికి కృషి చేస్తున్న సంస్థను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా అనాథ పిల్లలతో కేక్ కట్ చేయించి స్వీట్లు పంచారు. నాబార్డ్ సహకారంతో 55 మంది పిల్లలకు ట్రావెల్ బ్యాగ్స్‌ను, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో 27 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ 70 మందికి గొడుగులను, జేఎమ్‌జే సంస్థ మహిళలు చిన్నారులకు లంచ్‌బాక్స్ వాటర్‌బాటిల్స్‌ను పుట్టినరోజు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌కు చెందిన భాస్కర్, బీఎం లీలాకుమారి, శ్యాంసుందరప్రసాద్, ఫాదర్ ఇన్నారెడ్డి, ఫాదర్ సురేష్‌కుమార్, సిస్టర్ క్లిటస్, సిస్టర్ జెసిత, సిస్టర్ గ్లోరియా, సిస్టర్ సుమిర, సిస్టర్ సరిత, సిస్టర్ మేరికుమారి పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌ను మార్చేది ఓటు

మున్సిపల్ కమిషనర్ శేషన్న



విచిత్ర వేషధారణలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు



కొవ్వొత్తులతో ప్రదర్శనలో పాల్గొన్న కమిషనర్ శేషన్న, సిబ్బంది

తెనాలి అర్బన్: ప్రజాస్వామ్యంలో దేశ భవిష్యత్‌ను మార్చేది ఓటు మాత్రమేనని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. తెనాలి పుర పాలక సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ (సిస్టమ్యాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్) అవగాహన కార్యక్రమాన్ని రజకచెరువులోని పార్కు వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలోని మూల స్తంభాల్లో ప్రభుత్వం ఒకటని, దాన్ని ఎన్నుకునే సమయంలో అందరూ ఆలోచించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. అందరితో ఓటు వేస్తామని ప్రతి జ్ఞ చేయించారు. కొవ్వొత్తులతో మానవహారంగా ఏర్పడి అందరూ ఓటు వేయాలని కోరారు. వేషధారణలో శానిటరి ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు మన ఓటు–మన హక్కు ప్లకార్డుతో ప్రత్యేక ఆకర్షణంగా నిలిచారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, మెప్మా సీఎంఎం మాధవరావు, వాకర్స్, స్థానికులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



వస్త్రాలు అందజేస్తున్న ముస్లిం మత గురువులు

అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరుకు చెందిన కొత్తపల్లి అబ్బయ్య–అనంతమ్మల జ్ఞాపకార్థం వారి కుమార్తె యలమంచి మనోరమ రంజాన్ పురస్కరించుకుని 26 మంది నిరుపేద ముస్లింలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. యలవర్రు రోడ్డులోని స్థానిక జెండా చెట్టు సమీపంలోని ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత గురువు ఇమామ్ అబ్రహం, షేక్ కరీమా, షేక్ మౌలాలీ, రంజాని పాల్గొన్నారు.